

పోలింగ్ కేంద్రంలో ఓటు వేసే పనిలో గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



ఓటు వేసేందుకు వెళుతున్న నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు



పోలీసు బందోబస్తు మధ్య ఏలూరుకు బ్యాలెట్ బాక్సును తరలిస్తున్న దృశ్యం

ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

- 99.17 శాతం పోలింగ్ నమోదు
- కొవ్వూరు పట్టణంలో కోలాహలం
- ఓటు హక్కు వినియోగించుకున్న మంత్రి వనిత, ఇద్దరు ఎమ్మెల్యేలు



ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రంలోకి వెళుతున్న మంత్రి వనిత

కొవ్వూరు: స్థానిక సంస్థల కోటాలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని రెండు ఎమ్మెల్సీ స్థానాలకు సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు మధ్య పోలింగ్ నిర్వహించారు. దాంతో పట్టణంలో కోలాహలం నెలకొంది. కొవ్వూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని నిడదవోలు, కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాల స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీల నాయకులు భారీగా తరలిరావడంతో పట్టణంలో ఎక్కడ చూసినా సందడి కనిపించింది. టోల్‌గేట్ జంక్షన్ వద్ద గల ఎంపీడీవో కార్యాలయంలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో పోలీసులు వన్ వేలో ట్రాఫిక్‌ను మళ్లించారు. ప్రధాన కూడళ్లలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. హోం మంత్రి తానేటి వనిత, ఎమ్మెల్యేలు తలారి వెంకట్రావు, జి.శ్రీనివాస్‌నాయుడు, మునిసిపల్ చైర్‌పర్సన్లు భావన రత్నకుమారి, భూపతి ఆదినారాయణ, తొమ్మిది మంది ఎంపీపీలు, తొమ్మిది మంది జెడ్పీటీసీ సభ్యులు, పలువురు ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనారోగ్యం వల్ల నల్లజర్ల మండలం అయ్యవరం ఎంపీటీసీ సభ్యురాలు మారుబోయిన సత్యవతిని వీల్ చైర్‌లో పోలింగ్ కేంద్రానికి తీసుకొచ్చారు.

ఇద్దరి గైర్హాజర్

డివిజన్ పరిధిలో మొత్తం 242 మంది ఓటర్లుండగా, వారిలో 240 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. నిడదవోలు 12వ వార్డు కౌన్సిలర్ మేడపాటి సరితారెడ్డి ఆరోగ్య సమస్యలతో వైద్యానికి బెంగళూరు వెళ్లినందున, తెలికిచెర్ల ఎంపీటీసీ సభ్యురాలు తాడిపర్తి మంగ దుబాయ్‌లో ఉన్నందున వారిద్దరూ ఓటింగ్‌కు హాజరు కాలేదు. పోలింగ్ కేంద్రం ప్రాంగణంలో కొవ్వూరు అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారి కె.సత్య ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఓటర్ల గుర్తింపు కార్డుల పరిశీలనకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. జిల్లా అదనపు ఎస్పీ ఎం.రజని, కొవ్వూరు డీఎస్పీ వీఏ స్‌ఎన్ వర్మ, సహాయ ఎన్నికల అధికారి, కొవ్వూరు ఆర్డీవో ఎస్.మల్లిబాబు, తహసీల్దార్ బి.నాగరాజు నాయక్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. పోలింగ్ అధికారిగా కె.చల్లన్నదొర, ఏపీవోలుగా ఎన్.ప్రసాదరావు, ఎన్.ఆశాకిరణ్, జి.రత్నకిషోర్ వ్యవహరించారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను ఏలూరు తరలించారు.

పోలింగ్ సరళి ఇలా...

పోలింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో సాగింది. మొదటి గంటలో పోలింగ్ కాస్త మందకొడిగా సాగింది. ఉదయం తొమ్మిది గంటలకు 36 ఓట్లు పోలయ్యాయి. స్థానిక మంత్రి వనిత, ఎమ్మెల్యేలు శ్రీనివాస్ నాయుడు, వెంకట్రావుల తమ పార్టీ ప్రజాప్రతినిధులను వెంట బెట్టుకుని ఒకేసారి పోలింగ్ కేంద్రానికి వచ్చారు. దాంతో కేవలం ఉదయం 10 నుంచి 11 గంటల మధ్య గంట వ్యవధిలో ఏకంగా 55.37 శాతం ఓట్లు పోలయ్యాయి. ఉదయం పది గంటలకు 37.60 శాతం అంటే 91 మంది ,12 గంటలకు 92.97 శాతం అంటే 225 మంది ,12.45 గంటలకు 240 మంది ఓటు హక్కు వినియోగించు కున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఇదే గరిష్ట పోలింగ్ శాతం.మూడు నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీకి 198 ఓట్లు ఉంటే 196 మంది, టీడీపీకి 28, జనసేనకి 14, మంది,ఇతరులు ఒకరు, బీజేపీ తరఫున గెలుపొందిన ఒకరు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

జక్కంపూడి రాజా పర్యవేక్షణ

ఎన్నికల ప్రక్రియ ప్రారంభం నుంచి ముగిసేంత వరకు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా శ్రీనివాస స్నానఘట్టం వద్ద ఉండి మూడు నియోజకవర్గాల నేతలను సమన్వయం చేసుకున్నారు. ఎప్పటికప్పుడు ఆయా ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులతో మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించారు. ఆదివారం రాత్రి కొవ్వూరు విచ్చేసిన ఆయన అర్ధరాత్రి వరకూ స్థానిక హోం మంత్రి వనితతో కలిసి నిడదవోలు, గోపాలపురం ఎమ్మెల్యేలతో ఏర్పాట్లపై చర్చించారు. పార్టీ కొవ్వూరు నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు ఎస్.రాజీవ్‌కృష్ణ కూడా జక్కంపూడి రాజాతో పాటు కొవ్వూరులో ఉండి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

క్లుప్తంగా

'మానవత ' ఆధ్వర్యంలో తాళ్లపూడిలో వైద్య శిబిరం



శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

తాళ్లపూడి: మానవత స్వచ్ఛంద సంస్థ మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం తాళ్లపూడిలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్థానిక సొలస దమయంతి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్వహించిన ఈ శిబిరంలో ఏలూరులోని ఆశ్రం హాస్పిటల్ వైద్యులు 220 మందికి పరీక్షలు చేశారు. జనరల్, ఆర్థోపెడిక్, ఊపిరితిత్తులు, కంటి, చెవి, ముక్కు, గొంతు, చర్మ, గైనిక్, కార్డియాలజీ తదితర విభాగాల వైద్యులు సేవలు అందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. వైద్యులు నీరజ, గౌతమ్, గణేష్, లోకేశ్వర్ రెడ్డి, కీర్తి, అమృత, రోహిణి, దీప్తిలు రోగులను పరీక్షించారు. మానవత స్వచ్ఛంద సంస్థ మండలశాఖ అధ్యక్షుడు జె.వెంకటేశ్వరరావు, మండల రైస్‌మిల్లర్ల సంఘం అధ్యక్షుడు సింహాద్రి జనార్దనరావు, సభ్యులు వి.చంద్రయ్య, సీహెచ్ ఆంజనేయులు, సాయన సుబ్బారావు, సనపల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



తాళ్లూరి సత్యవతమ్మ

చాగల్లు: మండలంలోని గౌరిపల్లికి చెందిన శతాధిక వృద్ధురాలు తాళ్లూరి సత్యవతమ్మ (101) ఆదివారం మృతి చెందారు.తామంతా ప్రేమానురాగాలతో ఆదరించడంతో ఆమె ఆరోగ్యంగా నూరేళ్లు ఆనందంగా జీవించారని కుటుంబ సభ్యులు తెలిపారు.

నదిలో మునిగిపోతున్న బాలికను రక్షించిన గ్రామస్తులు

కొవ్వూరు: ఆరికిరేవుల గ్రామంలో సోమవారం మద్దూకూరి తేజస్విని అనే బాలిక ప్రమాదవశాత్తూ గోదావరి నదిలో పడి మునిగిపోతుండగా స్థానికులు గమనించి రక్షించారు. ఆ బాలిక తల్లితో పాటు గోదావరి నదికి వెళ్లింది. గోదావరి నదిలోకి దిగి ప్రమాదవశాత్తూ నీటిలో జారిపడింది. దీంతో అక్కడే ఉన్న స్థానికులు గుర్తించి ఆ బాలికను రక్షించారు.స్వల్ప అస్వస్థతకు గురైన బాలికను కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సకాలంలో చికిత్స అందించడం బాలిక కోలుకుంటోంది.

యువకుడి అదృశ్యంపై కేసు

నిడదవోలు రూరల్: మండలంలోని పురుషోత్తపల్లికి చెందిన కంచుపల్లి సురేష్ (23) అనే యువకుడు అదృశ్యమయ్యాడు. సమిశ్రగూడెం ఏఎస్సై పరమహంస సోమవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సురేష్ తాపీపని చేస్తూ కుటుంబానికి చేదోడుగా ఉంటున్నాడు. అయితే హైదరాబాద్‌లో పనిచేసేందుకు అతడు జనవరి 27న ఇక్కడి నుంచి వెళ్లాడు. కాగా ఈ నెల 7 నుంచి సురేష్ ఫోన్ పనిచేయడం లేదని తల్లి అమ్మాజీ సమిశ్రగూడెం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు.

గుర్తు తెలియని మహిళ ఆత్మహత్య

నిడదవోలు రూరల్: నిడదవోలు రైల్వేస్టేషన్ యార్డు సమీపంలో రాజమహేంద్రవరం వైపు వెళుతున్న గూడ్స్ రైలుకు అడ్డుగా వచ్చి గుర్తుతెలియని మహిళ ఆత్మహత్యకు పాల్పడినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ డి.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం గుర్తుతెలియని మహిళ (56) ఆత్మహత్య చేసుకునే ఉద్దేశంతో రైల్వే ట్రాక్ వద్దకు వచ్చిందన్నారు. ఆమె పసుసు రంగు చీర ధరించిందని, ఒక సంచితో పాటు టిఫిన్ బాక్స్ ఉందన్నారు. ఆమె వివరాలు తెలిస్తే 94417 50730, 9490617090 నంబర్లకు సంప్రదించాలని రైల్వే పోలీసులు కోరారు.

కొట్టి గాయపరిచిన వ్యక్తిపై కేసు

కొవ్వూరు: కొట్టి గాయపరిచిన వ్యక్తిపై సోమవారం కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు రూరల్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ రామకృష్ణ తెలిపారు. ఇంటి సరిహద్దు విషయమై మండలంలోని ధర్మవరం గ్రామంలో జొన్నకూటి సుబ్బారావుతో అదే గ్రామానికి చెందిన జొన్నకూటి బాబురావు, అతని భార్య ఘర్షణ పడ్డారు.ఈ వివాదంలో బాబురావుపై సుబ్బారావు కర్రతో దాడి చేశారు. ఎడమ చేతిపై గాయం కావడంతో బాబురావును కొవ్వూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు.బాధితుడి ఫిర్యాదు మేరకు సుబ్బారావుపై కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ రామకృష్ణ తెలిపారు.

పాస్టర్లపై దాడులను అరికట్టాలి

నల్లజర్ల: దేశంలోను, రాష్ట్రంలోను పాస్టర్లపై జరుగుతున్న దాడులను అరికట్టి, వారికి రక్షణ కల్పించాలని పాస్టర్స్ అసోసియేషన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ సమావేశం సోమవారం నల్లజర్లలో ఆ సంస్థ మండల శాఖ అధ్యక్షుడు సత్యప్రకాష్ అధ్యక్షతన జరిగింది. వివిధ అంశాలపై సమావేశంలో సభ్యులు చర్చించారు. క్రైస్తవ మందిరాలు నిర్మాణాలకు, మరమ్మతులకు ప్రభుత్వం నిధులు కేటాయించాలని కోరింది. కార్యక్రమంలో మరపట్లజోజి, ఐ.మోజెస్, జోసెఫ్ జాన్‌మార్క్, యజ్ఞా, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇకపై చిన్నారులకు సురక్షిత తాగునీరు

- అంగన్‌వాడీ కేంద్రాల్లో మినీ ఆర్వో ప్లాంట్లు
- నల్లజర్ల ప్రాజెక్ట్ పరిధిలో 49 చోట్ల చురుగ్గా పనులు



నల్లజర్ల మండలం అనంతపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో అమర్చిన ఆర్వో ప్లాంట్

నల్లజర్ల: చిన్నారులకు ఆటపాటలు నేర్పిస్తూ పోషకాహారం అందించే అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసి శుద్ధి చేసిన తాగునీటిని చిన్నారులకు అందించే ఏర్పాటు చేస్తున్నారు. వీటి ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా నిధులు కేటాయించాయి. చాలా అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రస్తుతం తాగునీటి సమస్యలు ఉన్నాయి. అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు పంచాయతీ కుళాయిలు, సమీప ఆర్వోప్లాంట్ల నుంచి తాగునీటిని తీసుకొస్తున్నారు. ఈ సమస్యకు పరిష్కారం చూపేలా మినీ ఆర్వో ప్లాంట్లను అందుబాటులోకి తీసుకు వస్తున్నారు.

నల్లజర్ల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని తాడేపల్లిగూడెం అర్బన్ మండలంలో 16, నల్లజర్ల మండలంలో 16, ఉంగుటూరు మండలంలో 17 ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నట్టు సీడీపీఓ స్వరాజ్యలక్ష్మి తెలిపారు. ఒక్కో ప్లాంటుకు రూ.24 వేల చొప్పున కేటాయించారు.అంగన్‌వాడీ కేంద్రాల్లో వీటిని ఏర్పాటు చేసే బాధ్యతను ఒక ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించారు. ప్రస్తుతం ఈ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఒక్కో ప్లాంటులో 20 లీటర్ల సామర్థ్యం గల ట్యాంకును అమర్చారు. ఇది గంటకు 15 లీటర్ల నీటిని శుద్ధి చేస్తుంది. కేంద్రానికి నీటి సదుపాయం ఉంటే నేరుగా పైపులైను ఏర్పాటు చేసి అమర్చుతున్నారు. లేనిచోట నీటిని తెచ్చి పోసి వినియోగిస్తున్నారు. సొంత భవనాలున్న చోట వీటి ఏర్పాటుకు ముందుగా ప్రాధాన్యత ఇస్తున్నట్టు సీడీపీఓ చెప్పారు. దశలవారీగా మిగతా కేంద్రాలకు ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు.

ప్రసూతి వార్డులో ఏసీలు ఏర్పాటు చేస్తాం

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- ప్రభుత్వాసుపత్రిలో తనిఖీలు



ప్రసూతి వార్డులో వసతులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు రూరల్: ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందించడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే జి. శ్రీనివాస్ నాయుడు అన్నారు. నిడదవోలు ప్రభుత్వాసుపత్రిని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, అక్కడ అందుతున్న వైద్య సేవలను స్వయంగా పరిశీలించారు. ఓపీ, ప్రసూతి, జనరల్ వార్డుల్లో అందుతున్న వైద్య సేవలను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు అత్యవసర వైద్యసేవలు అందించడంతో పాటు సత్యసాయి సేవా సంస్థల ద్వారా రోగులకు ఉచితంగా భోజనం అందిస్తున్నామన్నారు. ప్రసూతి వార్డులో తల్లీబిడ్డల కోసం రెండు ఏసీలు వెంటనే ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా కంటి వైద్యసేవలతో పాటు ఉచితంగా కళ్లజోళ్లు అందిస్తున్నామన్నారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైఎస్సార్ సీపీ మండలశాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, ఆసుపత్రి సూపరింటెండెంట్ ఏవీఆర్ఎస్ తాతారావు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. ఎస్ఆర్ సంజీవని హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు పరిశీలించారు. ఆసుపత్రిలో బ్లడ్ స్టోరేజ్ కోసం ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసి ఇప్పటికే 87 సార్లు రక్తదానం చేసిన రక్తదాత సరిపల్లి రమణ, యువకులను ఎమ్మెల్యే అభినందించారు. రక్తదానం చేసిన వారికి బ్లడ్ బ్యాంక్ ద్వారా సర్టిఫికెట్లు అందజేశారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు, సీఐ కె.వెంకటేశ్వరరావు, ఆసుపత్రి సూపరింటెండెంట్ ఏవీఆర్ఎస్ తాతారావు తదితరులు పాల్గొన్నారు.

108 శివలింగాలకు భస్మాభిషేకం

కొవ్వూరు: స్థానిక శ్రీనివాసపురం స్నానఘట్టంలో రావణబ్రహ్మ విగ్రహం వద్ద సోమవారం రాత్రి 108 శివలింగాలకు భస్మాభిషేకం నిర్వహించారు. లోక కల్యాణార్థం కాశీ నుంచి తీసుకు వచ్చిన 108 శివలింగాలకు శివభక్త రావణబ్రహ్మ శివాలయం వద్ద ఈ అభిషేకం చేశామని నిర్వాహకుడు అనపర్తి శివరామకృష్ణ తెలిపారు.అనంతరం భక్తులకు శివలింగాలు, తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. రావణబ్రహ్మ శివాలయ కమిటీ సభ్యులు జీబీవీ సుబ్రహ్మణ్యం, పాలకోడేటి సత్యనారాయణమూర్తిలతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి విరాళం



విరాళం అందజేస్తున్న దాత తానింకి సత్యనారాయణ కుటుంబ సభ్యులు

దేవరపల్లి: మండలంలోని గొల్లగూడెం వద్ద గల లగడపాటి రామానాయుడు, రామలక్ష్మమ్మ వయోవృద్ధుల ఆశ్రమానికి ప్రముఖ ఫైనాన్స్ సంస్థ పద్మశ్రీనివాస అధినేత తానింకి సత్యనారాయణ, జ్ఞానసుధ దంపతులు సోమవారం రూ.50 వేలు విరాళంగా అందజేశారు. తన సత్యనారాయణ తండ్రి రామారావు జ్ఞాపకార్థం ఆశ్రమంలో నిర్మాణంలో ఉన్న భవన నిర్మాణానికి ఈ మొత్తాన్ని విరాళం అందజేసినట్టు తానింకి సత్యనారాయణ తెలిపారు. సత్యనారాయణ, జ్ఞానసుధ, తల్లి భానుమతి చేతుల మీదుగా ఆశ్రమం వ్యవస్థాపన చైర్మన్ కాగిత భాస్కరరావుకు ఈ సొమ్ము అందజేశారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థుల గెలుపు ఖాయం

ఎమ్మెల్సీ ఎన్నికలపై ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు రూరల్: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు వంకా రవీంద్రనాథ్, కవురు శ్రీనివాస్ ఘన విజయం సాధిస్తారని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. నియోజకవర్గంలోని ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు, కౌన్సిలర్లతో కలిసి ఎమ్మెల్యే నిడదవోలు రోటరీ ఆడిటోరియం నుంచి సోమవారం ఉదయం కొవ్వూరులోని మండల పరిషత్ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రంలో వారందరూ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు మాట్లాడుతూ పదవుల కేటాయింపులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు పార్టీ విధేయులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ చైర్మన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, ఏఎంసీ చైర్మన్ వెలగన పోలయ్య, జెడ్పీటీసీ సభ్యులు నందిగం భాస్కరరామయ్య, కొయ్యే సూరిబాబు, కొమ్మిశెట్టి రామాంజని, ఎంపీపీలు తిరుమళ్ల భాగ్యలక్ష్మి, కార్చెర్ల ప్రసాద్, పాలాటి యల్లారేశ్వరి, వైఎస్సార్ సీపీ మండలశాఖల అధ్యక్షులు అయినీడి పల్లారావు, వీరమల్లు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి నుంచి..

దేవరపల్లి: కొవ్వూరు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో పాల్గొనేందుకు గోపాలపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆధ్వర్యంలో తరలి వెళ్లారు. ఉదయం 9 గంటలకు దేవరపల్లిలోని తన క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే వెంకట్రావు ఓటర్లకు సూచనలు చేశారు. అనంతరం వారందరూ కార్లలో కొవ్వూరు బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, ఎంపీపీలు కేవీకే దుర్గారావు, ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత తదితరులు ఉన్నారు.

సారా తయారీదారులకు బెల్లం విక్రయిస్తే చర్యలు

కిరణా వ్యాపారులకు ఎస్ఈబీ సీఐ సుధ హెచ్చరిక



బెల్లం అమ్మకాలపై కిరణా వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ సుధ

దేవరపల్లి: సారా తయారీదారులకు బెల్లాన్ని విక్రయిస్తే కఠినచర్యలు తప్పవని కిరణా, బెల్లం వ్యాపారులను దేవరపల్లి ఎస్ఈబీ సీఐ డి.సుధ హెచ్చరించారు. స్థానిక ఎస్ఈబీ స్టేషన్ కార్యాలయంలో సోమవారం కిరణా, బెల్లం వ్యాపారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కిరణా దుకాణాల్లో బెల్లం విక్రయాలపై రికార్డులు, బిల్లులు నిర్వహించాలన్నారు. ఎక్కువ మొత్తంలో బెల్లం కొనుగోలుదారుల వివరాలు తీసుకోవాలన్నారు.

15న వాహనాల బహిరంగ వేలం

ఈ నెల 15 ఉదయం 11 గంటలకు వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను స్టేషన్ వద్ద బహిరంగ వేలం వేస్తున్నట్టు సీఐ సుధ తెలిపారు. వేలంలో పాల్గొనేవారు దేవరపల్లి ఎస్ఈబీ స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

పోతినీడుపాలెంలో రాచెర్ల సతీష్ వద్ద నుంచి ఎనిమిది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, అతడిని అరెస్టు చేసినట్టు సీఐ సుధ తెలిపారు. నిందితుడిని తాడేపల్లిగూడెం కోర్టుకు హాజరు పరచగా రిమాండ్ విధించినట్టు ఆమె తెలిపారు.

పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆవిర్భావ వేడుకలు

చాగల్లు: పీఎంపీల వెల్ఫేర్ అసోసియేషన్ ఆవిర్భావ వేడుకలను చాగల్లులో సోమవారం నిర్వహించారు.ఈ సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు.అనంతరం పీఎంపీల అసోసియేషన్ మండల శాఖ అధ్యక్షుడు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు క్లినిక్‌లో కేక్ కటింగ్ చేసి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎస్.రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ ప్రాథమిక వైద్య సేవలు అందిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండే పీఎంపీల సేవలను కొనియాడారు. పీఎంపీల వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు బాబ్జీ, సూర్యప్రకాశరావు, బి.రవి, ఎస్.ఆనంద్ పాల్గొన్నారు.

కంటికి కనిపించని శత్రువు నులిపురుగు

నేడు జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం



నులిపురుగులతో బాధపడుతున్న బాలుడు

నల్లజర్ల: పిల్లల కడుపులో పెరిగే చిన్నపాటి నులి పురుగులు అనేక అనారోగ్యాలకు కారణమవుతాయి. వీటి నివారణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. రాష్ట్రీయ బాలా స్వచ్ఛ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు కార్యాచరణ రూపొందించింది. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించేందుకు వైద్య,ఆరోగ్య శాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. ఇందులోభాగంగా అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు, ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న 19 ఏళ్ల లోపు వారందరికీ మధ్యాహ్న భోజనం అనంతరం అల్బెండోజోల్-400 మిల్లీగ్రాముల మాత్రలను చప్పరించేలా చేస్తారు. ఉపాధ్యాయుల సహకారంలో వైద్య, ఆరోగ్యశాఖ ఈ బాధ్యత తీసుకుంది.

- **నులిపురుగులు అంటే ఏమిటి? వాటివల్ల వచ్చే అనారోగ్యసమస్యలు ఏమిటి?**
- సన్నటి దారం లాంటి నులిపురుగులు పొట్టలోని మన పేగుల గోడలను అంటి ఉండి శరీరంలో రక్తాన్ని పీలుస్తూ, తీసుకునే ఆహారంను మనకు వంట పట్టనీయవు. శరీరంలో ఇతర అవయవాలకు హాని కలగజేస్తాయి.
- సాధారణంగా పిల్లల్లో మూడు రకాల నులి పురుగులు కనపడుతుంటాయి.అవి నులి పురుగులు, ఏలిక పాములు, కొంకి పురుగులు. సాదారణంగా 50, 60 శాతం మంది పిల్లల్లో ఏదో ఒక రకం నులి పురుగులు ఉండి రక్తహీనతకు కారణమవుతాయి
- **నులి పురుగులు ఎలా వ్యాప్తిస్తాయంటే?**
- కలుషిత ఆహారం, ఈగలువాలిన తినుబండారాలు, దుమ్ము, ధూళిపడిన ఆహార పదార్థలు తినడం వల్ల వచ్చే నులిపురుగులు వచ్చే అవకాశం ఉంది. బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జనకు వెళ్ళడం ద్వారా వచ్చే అవకాశం ఉంది.

వ్యాధి లక్షణాలు..

- రక్తహీనత, నీరసించడం, దగ్గు, ఆయాసం, ఎదుగుదల లేకపోవడం, దురద, చర్మంపై దద్దుర్లు, బరువు తగ్గిపోవడం, కడుపు నొప్పి, వాంతులు, విరేచనాలు, మలంలో రక్తంపడడం, జ్వరం, తలనొప్పి,ఆకలి మందగించడం వంటివి కనపడతాయి.

అల్బెండజోల్ మాత్రలు..

భోజనానికి గంట ముందు ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది విద్యార్థుల తల్లిదండ్రులకు నులి పురుగుల నివారణ, మంచి ఆహారపు అలవాట్లు, చేతులు శుభ్రపరుచుకోవడం, వ్యక్తిగత పరిశుభ్రత గురించి వివరించాలి. భోజనం తర్వాత ఆల్బెండజోల్ మాత్రలను చప్పరించి నమిలి మింగేలా చర్యలు తీసుకోవాలి. మాత్రలు వేసుకున్న వెంటనే వాంతులు, వికారం వచ్చినా కంగారు పడాల్సిన అవసరం లేదు.

ఇవీ వ్యాధి నివారణ చర్యలు



కంటికి కనిపించని శత్రువు నులిపురుగు. మనిషి పేగులలో చేరి రక్తాన్ని పీల్చి పిప్పిచేసి, రక్తహీనతకు గురి చేస్తుంది. ఇది చిన్న సమస్యగా భావించకూడదు. భావి,భారతపౌరులైన చిన్నారుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. దీనిపై తల్లిదండ్రులకు అవగాహన కలిగించి నివారణ చర్యలు తీసుకుంటున్నాం.

– దాక్టరు తెల్లం గంగాధరరావు, పీహెచ్‌సీ డాక్టర్, నల్లజర్ల

ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా..



విద్యార్థులు నులి పురుగుల బారిన పడకుండా రక్షించేందుకు రెండేళ్ల చిన్నారుల నుంచి19 ఏళ్ల యువతీ, యువకులకు నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేశాం.ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– కె. చంద్రశేఖరరాజు, సీహెచ్ఓ, నల్లజర్ల